క్లుప్తంగా

కమనీయం.. శ్రీవారి కల్యాణం



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గమ్మ వార్షికోత్సవం



గుడివాడ టౌన్: స్థానిక కొత్తపేటలో వేంచేసియున్న శ్రీవిజయదుర్గ అమ్మవారి 18వ వార్షిక మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొత్తపేటకు చెందిన 108 మంది మహిళలు స్థానిక పామర్రు రోడ్డులోని పెద్దకాల్వ వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కృష్ణానదీ జలాలను 108 బిందెలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి అభిషేకాలు చేశారు. లోక కల్యాణార్థం కొత్తపేట వాసుల సంక్షేమం కొరకు ఈ అభిషేకాలు చేస్తున్నామని ఆలయ అర్చకుడు హేమంత్ రవికుమార్ శర్మ తెలిపారు.

సత్యదేవుని ఆలయానికి విరాళం



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామివారి ఆలయ పునర్నిర్మాణ పనులకు దాతలు రూ.50వేల విరాళం ఇచ్చారు. ఆదివారం ఈ విరాళాన్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు అందించారు. గుడ్లవల్లేరు మాజీ సర్పంచి స్వర్గీయ వల్లభనేని శ్రీకృష్ణ స్మారకార్థం కుమారులు రామ్‌చంద్, ఫణీంద్ర విరాళం ఇచ్చారని వెంకట్రావు, ధర్మకర్త మురాల నరేష్ తెలిపారు.

రూపు కోల్పోతున్న వీరంకిలాకులు

- దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- అభివృద్ధి చేయాలని కోరుతున్న రైతులు



మరమ్మతులకు నోచుకోని బ్రిటీష్ హయాంలో నిర్మించిన ఇరిగేషన్ బంగ్లా



శిథిలావస్థకు చేరిన వీరంకిలాకులు



అధ్వానంగా ఏఈ క్వార్టర్



సూపరింటెండెంట్ కార్యాలయం దుస్థితి

పమిడిముక్కల: మరమ్మతులకు నోచుకోక వీరంకిలాకులు రూపు కోల్పోతున్నాయి. బందర్ కాలువపై వీరంకి పరిధిలో 1801వ సంవత్సరంలో లాకులు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఏఈ, సూపరింటెండెంట్, సిబ్బంది కోసం క్వార్టర్లు కూడా నిర్మించారు. కాలువల పర్యవేక్షణకు ఉన్నతాధికారులు వచ్చినప్పుడు ఉండేందుకు ఇరిగేషన్ బంగ్లా నిర్మించారు. అయితే ఇవి ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ఏఈ క్వార్టర్ శిథిలమైంది. సూపరింటెండెంట్ కార్యాలయం అధ్వాన స్థితికి చేరింది. ఇరిగేషన్ బంగ్లాలో వర్షం పడితే నీరు కారుతోంది. దీంతో దశాబ్దాల తరబడి మరమ్మతులకు నోచుకోక ఇవి శిథిలావస్థకు చేరి రూపురేఖలు కోల్పోతున్నాయి. లాకుల వద్ద ఉన్న ఛాంబర్ తలుపులు తుప్పుపట్టి ఉన్నాయి. లాకుల గోడలపైన చెట్లు పెరుగుతున్నాయి. వీరంకి సెక్షన్‌లోని ఈ లాకుల ద్వారా 41 వేల ఎకరాలు సాగవుతుంది. 18 మంది లస్కర్లు పనిచేసిన ఈ లాకుల్లో ప్రస్తుతం ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో కాలువలపై పర్యవేక్షణ కొరవడింది. సాగునీటి సంఘాలు తమ పరిధిలోని కాలువలతో పాటు లాకులు, క్వార్టర్ల అభివృద్ధిపై దృష్టి సారించి పూర్వ కళ తెచ్చేందుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు. లాకులు, క్వార్టర్ల పరిస్థితి, సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని ఏఈ టి. వీరాంజనేయులు తెలిపారు.



గుర్రాల్లంకలో యువకుల సందడి



కొతవరంలో నిమజ్జన ఊరేగింపులో పోలీసులు, యువకులు

గంగ ఒడికి గౌరీ తనయుడు

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిప్రపత్తులతో కొనసాగుతున్నాయి. ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో గణనాథుని నిమజ్జనాలు, అన్నసమారాధనలను ఆనందోత్సాహాల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిమజ్జనంలో గణనాథుని విగ్రహాలను యువత, పెద్దలు బాణాసంచా, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

-సాక్షి నెట్‌వర్క్



ముదినేపల్లిలో గణనాథుడికి పూజలు చేస్తున్న ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ



గుడివాడలో గణనాథుని ఊరేగిస్తున్న పోలీసులు



నర్సన్నపాలెంలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణపతి



కలిదిండి మండలం కాళ్లపాలెంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

పంచముఖ గణపతిగా స్వామివారు



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసియున్న శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని పంచముఖ గణపతిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

యూరియా కోసం అన్నదాతల ఆందోళన



వెంట్రప్రగడ(పెదపారుపూడి): యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని వెంట్రప్రగడలో బోస్ బొమ్మ సెంటర్ వద్ద ఆదివారం పలువురు రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వెంట్రప్రగడ, మోపర్రు, వింజరంపాడు గ్రామాల్లో సుమారు 6వేల ఎకరాల్లోని వరి పంటకు ప్రస్తుతం యూరియా అవసరం ఉండగా ఒక్క బస్తా కూడా దొరకడం లేదని వాపోయారు. మండలంలోని ఐదు పీఏసీఎస్ సొసైటీల్లో కూడా లేదంటున్నారు. యూరియా అందకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రైతులకు వెంటనే యూరియా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు రామ్మోహనరావు, సత్యనారాయణ, నరసింహారావు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సమాజానికి 'మానవత' కృషి



మండవల్లి: మెరుగైన సమాజం కోసం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తోందని కెరీర్ గైడెన్స్ చైర్మన్ సూదాబత్తుల విజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గుడివాడ గణేష్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవత సంస్థ ద్వారా పలువురికి ఆర్థిక సాయంతో పాటు నెలవారీ సరుకులు, ఫ్రీజర్ బాక్సులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. గన్నవరంకు చెందిన బొప్పన నాగమల్లేశ్వరరావుకు నిత్యావసర సరుకులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు బొల్లెంపల్లి కృష్ణారావు, కూనపురెడ్డి బాల కోటేశ్వరరావు, పి.కిన్నెబాబు, వి.శ్యామ్ గణేష్, బుద్ధుల రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



కైకలూరు: దత్తాశ్రమ కమిటీ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్ ఆధ్వర్యాన దత్తాశ్రమంలో విజయవాడ పెదేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడానికి డాక్టర్లు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సమీప ప్రాంతాల నుంచి 400 మంది ఉచిత పరీక్షలు చేయించుకున్నారు. పెదేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ డాక్టర్ పల్లెం ఆకాష్, మరో ఏడుగురు వైద్యులు వివిధ పరీక్షలు చేసి, ఉచిత మందులు పంపిణీ చేశారు.

దత్తాశ్రమంలో...

మండవల్లి: మండలంలోని లోకుమూడి దత్తాశ్రమంలో పల్లెం పెదేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే కామినేని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా ఆదివారం నియోజకవర్గంలోని వరహాపట్నం యాదవ బజార్, జమ్మి చెట్టు సెంటర్, కైకలూరు వెలంపేట, వింజరం, వేమవరప్పాడు, కలిదిండి, సానారుద్రవరం, పడమటిపాలెం గ్రామాల చవితి మండపాల్లో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అంధకారంలో అక్కినేని వారధి



నందివాడ: మండలంలోని కుదరవల్లి గ్రామంలో అక్కినేని వారధిపై వీధిలైట్లు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. దీంతో వారధిపై వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందల సంఖ్యలో ఈ మార్గం గుండా వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. వీధిలైట్లు లేకపోవడంతో ఇదే ఆసరాగా చేసుకున్న మందుబాబులు వారధిపై మద్యం సేవిస్తున్నారు. మద్యం సీసాలను వారధిపై పగలకొట్టడంతో గాజుముక్కలు గుచ్చుకొని పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. వీధిలైట్లు వెలగక రాత్రిపూట అంధకారంలో జనం ఇబ్బంది పడుతున్నారు. రాత్రిళ్లు బయటికి రావాలంటే పాములు, తేళ్లు ఎక్కడ కాటేస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వారధిపై లైట్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గణనాథునికి డీఎన్నార్ పూజలు

కలిదిండి(కైకలూరు): ప్రజలకు విఘ్నాలు తొలగించాలని కోరుతూ ఆదివారం వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కలిదిండి మండలం కాళ్ళపాలెంలోని వినాయక చవితి పందిరిలో పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలందరికీ స్వామివారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కైకలూరు మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, పేటేటి రాంపండు పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీకొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తులు ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. సెలవు రోజు కావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాల్ని స్వీకరించారు.

■ ఉపాధ్యాయుడు బెనర్జీకి అవార్డు

కైకలూరు: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసరావుపేటలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బహుమతుల ప్రదానం కార్యక్రమం జరిగింది. కైకలూరు మండలం గోపవరం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సహజకవి దండే బెనర్జీకి వివిధ సాహితీ రచనలకు గాను తెలుగు తేజం అవార్డును అందుకున్నారు.

■ నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం 11కేవీ ఆటపాక ఫీడర్‌కు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ జీబీ.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా కైకలూరు సమీప ఏలూరు రోడ్డు, వైఎస్సార్ కాలనీ, జాన్ పేట, ఆటపాక గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పేరుకుపోయిన వ్యర్థాలు



పుల్లేరులో మంటాడ శివాలయం వద్ద నిలిచిన వ్యర్థాలు

మంటాడ బైపాస్ వంతెన వద్ద పుల్లేరులో గుర్రపుడెక్క, వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇక్కడ పుల్లేరు పక్కనే శివాలయం, శ్మశానవాటిక ఉన్నాయి. దుర్వాసన వస్తుండటంతో శివాలయానికి వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆలయంలో ప్రశాంతంగా ఉండేందుకు కూడా అవకాశం లేదని దుర్వాసన భరించలేకపోతున్నామని భక్తులు పేర్కొంటున్నారు. ఇక శ్మశానవాటికకు వచ్చే వారు దహన సంస్కారాలు నిర్వహించేందుకు అవస్థలు పడుతున్నారు. రేవులోకి దిగే పరిస్థితి లేదని చెబుతున్నారు. ఇరిగేషన్ అధికారులు పుల్లేరులోని వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

-పమిడిముక్కల